క్లుప్తంగా

బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

వెల్దండ: మండలంలోని బైరాపూర్ వాగుపై నూతన బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. వెల్దండ–చారకొండ రహదారిలో బైరాపూర్ వాగుపై ఉన్న బ్రిడ్జి రెండేళ్ల కిందట కొట్టుకుపోయిందని వివరించారు. తలారి నర్సింహా, నర్సింహా, పెద్ద జంగయ్య, చిన్న జంగయ్య, రామస్వామి, మల్లేష్, సాయితిరుమల, సాయి చెతన్య, కృష్ణయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

చారకొండ: మండలంలోని జూపల్లిలో ఆదివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా పోచమ్మ ఆలయాన్ని చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని సింగారంలో ఆదివారం గ్రామ దేవతల బోనాలను నిర్వహించారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈదమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా చేరుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మంగళసూత్రం విరాళం

వెల్దండ: మండలంలోని బండోనిపల్లిలో ఆదివారం రాత్రి నిర్వహించే ఈదమ్మ మాందాత కల్యాణోత్సం సందర్భంగా బొల్లంపల్లి గ్రామానికి చెందిన జక్కుల చిన్న జంగయ్య ఉత్సవ కమిటీ సభ్యులకు పుస్తె, మెట్టెలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో నరేష్‌యాదవ్, కొండల్‌యాదవ్, జంగయ్య, మల్లేష్‌యాదవ్, రామచంద్రయ్య, గోపాల్, రమేష్, యాదయ్య, ప్రకాష్, ప్రమోద్, సంతోష్, దేవయ్య తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి



కల్వకుర్తిరూరల్: ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డివిజన్ అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నూతన పెన్షన్ విద్రోహ దినం నిర్వహించారు. రఘురాం, ఆనంద్, సాయిరమేష్, నెహ్రూ ప్రసాద్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

కల్వకుర్తిరూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని బీసీ సబ్‌ప్లాన్ సాధన సమితి నియోజకవర్గ అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం కల్వకుర్తిలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సమావేశంలో రమేష్ చారి, సదానందం గౌడ్, గంగాధర్, సైదులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వరిచేనులో పడి యువకుడు మృతి

తాడూరు: మండలంలోని తిరుమలాపూర్ గ్రామ సమీపంలో వరిచేనులో పడి ఆదివారం వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ స్వామి కథనం మేరకు రేవల్లి మండలం తలుపునూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్(31) సొంత పనులు చేసుకుంటూ జిల్లా కేంద్రం నాగర్‌కర్నూల్‌లో స్థిరపడ్డాడు. శనివారం ఉదయం మండలంలోని తిరుమలాపూర్‌లో తొట్టెల కార్యక్రమానికి భార్య కవిత, కూతురు వెళ్లారు. అదే రోజు సాయంత్రం కాలినడకన నాగర్‌కర్నూల్ నుంచి తిరుమలాపూర్‌కు వెళ్తుండగా ఫిట్స్ వచ్చి రోడ్డు పక్కనే ఉన్న వరిపాలంలో పడిపోయి చనిపోయాడు. ఆదివారం ఉదయం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

అచ్చంపేట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ప్రధాన రహదారి గుండా శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. సాయి శంకర్, మనోహర్, రాధాకృష్ణ, శశిప్రీతం, వరుణ్, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని ముకురాలలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రాములమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. కాంగ్రెస్ పార్టీ మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు ముకురాల తిరుపతిరెడ్డి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల నగదు, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు.



నాగర్‌కర్నూల్ మండలంలో అలుగు పారుతున్న నాగసముద్రం చెరువు



తాడూరు మండలం పాలుమూరు దగ్గర ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్న వాగు



బిజినేపల్లి శివారులో నీటిలో మునిగిన వరి పొలాలు

వర్ష బీభత్సం

- ఎడతెరపిలేని వాన
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- అలుగుపారిన చెరువులు
- అస్తవ్యస్తంగా జనజీవనం
- నీట మునిగిన పంటలు



తెలకపల్లి మండలం రాకొండలో ఇళ్లలోకి చేరిన వర్షం నీరు



అచ్చంపేట–చౌటపల్లి దారిలో ప్రవాహిస్తున్న చంద్రవాగు



దుందుభీ నది వద్ద భారీకేడ్లు ఏర్పాటు చేస్తున్న అధికారులు



సింగోటం గ్రామానికి సమీపంలో ప్రధాన రహదారిపై విరిగిపడ్డ చెట్టు



అలుగు పారుతున్న చుక్కాయిపల్లి చెరువు



పెద్దకొత్తపల్లిలో అలుగు పారుతున్న గోగినేని చెరువు



తాడూరు సబ్‌స్టేషన్‌లో..

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వాన కురుస్తోంది. కుండపోత వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. జిల్లాలో కుంటలు, చెరువులు నిండుకుండలా తలపిస్తున్నాయి. డ్రెయినేజీలు, అలుగులు పారాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. పంటలు నీట మునిగాయి. పాత ఇళ్లు నేలమట్టం అయ్యాయి. రహదారులు జలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. నాగర్‌కర్నూల్ మండలంలో మండలంలోని సత్య సముద్రం, నాగసముద్రం చెరువులు అలుగులు పారాయి. తూడుకుర్తి, శ్రీపురం గ్రామాల మధ్య ఉన్న కాజ్‌వే పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచాయి.

అచ్చంపేట: చౌటపల్లి–అచ్చంపేట రోడ్డులోని చంద్రవాగు, మన్నెవారిపల్లి–దేవరకొండ రహదారిలోని దుందుబీ వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పోలీసులు ముందుస్తుగా వాహనాలు వెళ్లకుండా ముళ్లకంచెలు ఏర్పాటు చేసి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈగలపెంట సమీపంలో శ్రీశైలం ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. డీఎస్పీ శ్రీనివాసులు పోలీస్ యంత్రాగాన్ని అప్రమత్తం చేస్తూ శ్రీశైలం యాత్రికుల వాహనాలను మన్ననూర్ చెక్‌పోస్టు వద్దు నిలిపివేశారు. వాహనాలను మన్ననూర్ నుంచే వెనక్కి పంపిస్తున్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని మన్నెవారిపల్లి వద్ద డిండి వాగు నుంచి వరద నీరు అధికం కావడంతో కాజ్‌వే నుంచి నల్లగొండ జిల్లా దేవరకొండకు, మార్లపాడుతండా వద్ద వాగునీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అక్కారం, ఘనపూర్, బక్కలింగాయపల్లి, ఆంజనేయతండా, దండ్యాలంతండాకు రాకపోకలు స్తంభించాయి. చౌటపల్లి వాగు, చంద్రసాగర్ వాగుతో పాటు ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటలు నిండి అలుగు పారాయి.

కల్వకుర్తి టౌన్: విద్యానగర్ కాలనీలోని హైదరాబాద్ రోడ్డులో ఇళ్ల మధ్య నీరు చేరింది. నీరు దిగువ ప్రాంతానికి వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. పాతబస్తీలోని పలు ప్రాంతాలలో ఇళ్లలోకి నీరు చేరింది.

కల్వకుర్తిరూరల్: మండలంలోని యంగంపల్లి, మార్చాల, తుర్కలపల్లి, పంజుగుల, గ్రామాల పరిధిలో వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పంజుగుల సమీపంలో కత్వ ఉప్పొంగింది. తుర్కలపల్లి పంజుగుల గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

కొల్లాపూర్: మండలంలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు 130 మి.మీ., కోడేరు మండలంలో 116.4 మి.మీ., పెద్దకొత్తపల్లి మండలంలో 110.4 మి.మీ., పెంట్లవెల్లి మండలంలో 87.0 మి.మీగా వర్షపాతం నమోదైంది. పట్టణంలోని చెరువులన్నీ నిండుకుండలా మారాయి. చుక్కాయిపల్లి చెరువు అలుగు పారింది. మూలవాగు ఉధృతంగా ప్రవహించడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపం వరకు వరదపోటెత్తింది. సమీపంలోని పొలాలతో పాటు శ్మశానవాటిక సగభాగం నీటిలో మునిగింది. చౌటబెట్లకు వెళ్లేదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్టీ బాలుర వసతిగృహం ఆవరణలోకి వర్షం నీరు చేరింది. చౌటబెట్ల నుంచి కొల్లాపూర్‌కు ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ వ్యక్తి వాగు దాటే క్రమంలో నీటిలో పడిపోయాడు. స్థానికులు వెంటనే అతన్ని కాపాడారు. పెంట్లవెల్లికి వెళ్లే దారిలో వరిదేల చెరువు తూము నీళ్ల కారణంగా కొన్ని గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచాయి.

కొల్లాపూర్ రూరల్: ముక్కిడిగుండం సమీపంలో ఉన్న పెద్దవాగు ఉప్పొంగి ప్రవాహించింది. సింగోటం వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద చెట్టు నేలకొరిగింది. సింగోటం రిజర్వాయర్ అలుగు పోతుంది. వాహనరాకపోకలు నిలిచిపోయాయి.

తాడూరు: మండలంలోని చర్ల ఇటిక్యాలలో గ్రామాన్ని అనుసరించుకుని ఉన్న కాలువ తెగడంతో గ్రామంలోకి వరద నీరు చేరింది. జేసీబీ ద్వారా మట్టిని వేసి తాత్కాలికంగా చర్యలు తీసుకున్నారు. మండల వ్యాప్తంగా 118.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఐతోలు, ఇంద్రకల్, యత్మతాపూర్ గ్రామాల్లో రోడ్లు చెరువులను తలపించాయి. మేడిపూర్‌లో దుందుబీ నది ఉధృతంగా ప్రవహించింది.

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): బిజినేపల్లి మండల వ్యాప్తంగా దాదాపు 60 శాతం వరకు వరి, పత్తి, ఇతర పంటలు నీట మునిగాయి. వర్షం ధాటికి రోడ్లు దెబ్బతిన్నాయి. తిమ్మాజిపేట మండలంలోని నేరేళ్లపల్లిలోని నడుపులమ్మ, ఊర చెరువు, పోతిరెడ్డిపల్లి మేలకుంట చెరువు, ఏదిరేపల్లి గొనిచెరువులు నిండాయి.

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి, అనంత సాగర్, చిన్నముద్దునూరు, దాసుపల్లి, గౌరారం, పెద్దూరు చెరువులు, కుంటలు నిండాయి. పత్తి, మిరప, వరి పంటలు పూర్తిగా వర్షపు నీటిలో మునిగాయి. తెలకపల్లి చిలుకవాగు, రామగిరి వద్ద దుందుభీ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అటువైపు వెళ్లకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు భారీకేడ్లు ఏర్పాటు చేశారు. శివగంగ ఫంక్షన్ హాల్ దగ్గర భారీ వేపచెట్టు నేలకొరిగింది.

పెద్దకొత్తపల్లి: గోగినేని చెరువు అలుగు పారింది. మండలంలోని వెన్నచర్ల ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభం, భారీవృక్షం నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

పెంట్లవెల్లి: పెంట్లవెల్లి, మంచాలకట్ట మార్గ మధ్యలో ఉన్న వాగు పొంగిపొర్లింది. చౌట చెరువు నిండింది. మండల కేంద్రంతోపాటు మాధవస్వామినగర్, ఎంగంపల్లితండా, మల్లేశ్వరం, గోపులాపూర్, కొండూరు వంటి గ్రామాల్లో దాదాపు 90 ఎకరాల వరకు వరిపంట నీట మునిగింది.

బల్మూర్: మండలంలోని వీరంరాజ్‌పల్లి, రామాజిపల్లి, జిన్‌కుంట, పోలేపల్లి, పోలిశెట్టిపల్లి, గోదల్, బల్మూర్, మైలారం, తుమ్మెన్‌పేట చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. అచ్చంపేట–బల్మూర్ రహదారిపై భారీవృక్షం నేలకొరిగింది. మండల కేంద్రంతోపాటు కొండనాగులలో విద్యుత్ తీగలు తెగిపోయాయి.

ఉప్పునుంతల: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండ కురిసిన వర్షాలకు మండల సరిహద్దులోని దుందుబీ వాగు శనివారం రాత్రి నుంచి ఉధృతంగా ప్రవహిస్తుంది. మొల్గర వద్ద వాగులో ఉన్న కాజ్‌వే రోడ్డు పైనుంచి వరదనీరు పారుతుండటంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మండలంలోని మామిళ్లపల్లి– దాసర్లపల్లి మధ్యలో ఉన్న చిలుకల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని మామిళ్లపల్లి, లక్ష్మాపూర్, ఉప్పునుంతల, వెల్టూరు గ్రామాల్లో చెరువులు అలుగులు పారుతున్నాయి. ఈ వర్షాలకు ఆయా గ్రామాల్లో నాలుగు పాత మట్టి మిద్దెలు కూలిపోయినట్లు ఎమ్మార్వై సుజాత తెలిపారు. అదేవిధంగా కాంసానిపల్లిలో వర్షం పడుసుకు పల్లెప్రకృతివనంలోని బోరు మోటరు వద్ద వైర్లకు తగిలి కరెంట్ షాక్‌తో ఒక గేదె చనిపోయినట్లు ఆమె తెలిపారు.

లింగాల: చెన్నంపల్లి, పద్మన్నపల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అప్పాయపల్లి మార్గంలో ఉన్న పెద్దవాగు, అవుసలికుంట, శాయిన్‌పేట ఉన్న వాగులు పొంగి పొర్లుతున్నాయి.

అమ్రాబాద్: అమ్రాబాద్, పదర మండలంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. కొత్త చెరువు, లోకేశ్వరం చెరువు పూర్తిస్థాయిలో నిండాయి.

కోడేరు: కోడేరు, బావాయిపల్లి, ఖానాపూర్, మైలారం నుంచి కదిరెపాడు వెళ్లే బ్రిడ్జిపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. అధికారులు ప్రధాన వాగుల వద్ద జేసీబీ సహాయంతో రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంపలను వేశారు.

వెల్దండ: గాన్‌గట్టుతండా వాగు ఉధృతంగా ప్రవాహించడంతో బొల్లంపల్లి చెరువులోకి నీరు చేరుతోంది. రాచూర్‌లోని అప్పాయికుంట అలుగు పారింది. మండల కేంద్రంలోని కొండకత్వలోకి నీరు చేరింది.



ముక్కిడిగుండం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వాగు



పెంట్లవెల్లి, మంచాలకట్ట మధ్యలో పొంగిపొర్లుతున్న వాగు



ఎంగంపల్లితండాలో నీట మునిగిన వరి పంట



కల్వకుర్తిలో..



కల్వకుర్తిలో ఉప్పొంగి ప్రవహిస్తున్న చెరువు



ఉప్పనుంతలలో దుందుబీ వాగులో ..



పొలాల మీదుగా వెల్టూరు చెరువు అలుగు



మైలారం వద్ద నీట మునిగిన పత్తి పంట



కోడేరు మండలం పస్పుల వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్



బిజినేపల్లి మండలం నేరేళ్లపల్లిలో..



మేడిపూర్ దగ్గర నిండుగా ప్రవహిస్తున్న దుందుభీ నది

వరద ఉధృతిని పరిశీలించిన ఆర్డీఓ



కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట గ్రామాన్ని ఆర్డీఓ శ్రీను నాయక్ సందర్శించారు. రఘుపతిపేట, రామగిరి మధ్యలో ఉధృతంగా వరద ప్రవహిస్తుండటంతో భారీకేడ్లను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఇబ్రహీం, పోలీసులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెద్దకొత్తపల్లి/పెంట్లవెల్లి: రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ సతీష్, పెంట్లవెల్లి ఎస్‌ఐ రామన్‌గౌడ్‌లు సూచించారు. పాత ఇళ్లలో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. సమస్యలు ఉంటే డయల్ 100 కు ఫోన్ చేయాలని కోరారు.

వ్యక్తిని కాపాడిన స్థానికులు

తెలకపల్లి: మండల కేంద్రంలోని అచ్చంపేట వెళ్లే రోడ్డులో బ్రిడ్జి వద్ద తెలకపల్లికి చెందిన తిరుపతయ్య ఆదివారం సాయంత్రం చేపలవేటకు వెళ్లాడు. నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఒక్కసారిగా తిరుపతయ్య నీటిలో మునిగి కొట్టుకుపోయాడు. కొంత దూరం కొట్టుకుపోయి ఒక చెట్టును పట్టుకున్నాడు. గమనించిన స్థానికులు అతన్ని వెంటనే బయటకు లాగి కాపాడారు.

బాధితులకు పునరావాసం



బల్మూర్: మండలంలోని బాణాలలో ప్రమాదం ఉన్న మట్టి మిద్దెల ఇళ్ల కుటుంబసభ్యులను ఆదివారం తహసీల్దార్ శ్రైలింద్రకుమార్ ఆధ్వర్యంలో రైతువేదికలో పునరావాసం కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గురుస్వామి, ఎంపీడీఓ రాఘవులు, ఎంపీఓ నరేష్‌లు పాల్గొన్నారు.

వర్షం ధాటికి కూలిన ఇళ్లు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు పాత మట్టి మిద్దె ఇళ్లు కూలాయి. వెల్దండ మండలంలోని రాచూర్‌లో వడ్ల వెంకటయ్యకు చెందిన మట్టిమిద్దె ఇల్లు, చారకొండ మండల కేంద్రానికి చెందిన గౌస్ మట్టి ఇల్లు, జూపల్లిలో అంకిల్ల మైసమ్మ, జంతుక బాలస్వామి, అంకిల్ల రాములమ్మకు చెందిన మట్టి ఇల్లు, కల్వకుర్తి మండలం యంగంపల్లి గ్రామానికి చెందిన భగవాన్, తాంద్రకు చెందిన మహ్మద్ యూసూఫ్ ఇళ్లు కూలిపోయాయి. పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్లలో బండారి రాము, బండారి సరిత, వట్టిపల్లి కుర్మమ్మ, ముచ్చు కొండమ్మలకు సంబంధించిన ఇళ్లు నేలమట్టమయ్యాయి. కోడేరు మండలం నాగులపల్లిలో చావిలి, బల్మూరు మండలం కొండనాగులలో జహంగీర్ ఇల్లు కూలింది. అచ్చంపేటలోని జూబ్లీనగర్‌కు చెందిన జిల్లెల కృష్ణారెడ్డికి చెందిన మట్టిమిద్దె కుప్పకూలింది. అమ్రాబాద్ మండలం కల్ములోనిపల్లి, ఒంగురోనిపల్లి, మాచారం, వెంకటేశ్వర్లబావి తదితర గ్రామాల్లో మొత్త 11 ఇళ్లు కూలాయని అధికారులు తెలిపారు. రెవెన్యూ అధికారులు కూలిన ఇళ్లను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. తెలకపల్లి మండలం గౌరారంలో మొగిలి మల్లయ్య, మొగిలి ఎల్లయ్యలతో పాటు చిన్న ముద్దునూరులో ఎల్లికంటి కాశన్న, తెలకపల్లిలో పలువురి ఇళ్లు కూలాయి. తాడూరు మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన బంగారుగౌడ్ ఇల్లు కూలి గాయాలయ్యాయి. పాళ ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. లింగాల, శాయిన్‌పేట, అంబట్‌పల్లి గ్రామాల్లో పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.



చారకొండ మండలం జూపల్లిలో..



వెల్దండ మండలం రాచూర్‌లో వర్షానికి కూలిన ఇల్లు



అమ్రాబాద్ మండలం కల్ములోనిపల్లిలో..